ఏయూ లుక్స్
తెలుగు వార పత్రిక
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్

ANDHRA UNIVERSITY
Accredited by NAAC With 'A' Grade
ISO 2001:2015 Certified
aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com
ఫోన్ : 0891-2844000
August 13 - 19, 2023

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. V.Krishna Mohan
సంపుటి : 2 | సంచిక : 79 | పేజీలు : 6

## అసమానతలులేని సమాజానికి

# ఆచార్యులే మార్గదర్శకులు



**ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి**

**ఏయూలో ఘనంగా 77వ స్వాతంత్ర్యదిన వేడుకలు**

**అభివృద్ధివైపు ప్రయాణిస్తూనే సామాజిక చైతన్యానికి ఆచార్యులు కృషిచేయాలని వీసీ దిశానిర్దేశం**

**యువతలో చైతన్యం, నాణ్యమైన విద్య అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్న వీసీ**

**ఈ దిశగా ఏయూ విస్తృత కృషి చేస్తోందని వెల్లడి**

**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆర్థిక, సామాజిక అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ఆచార్యులు మార్గదర్శకులుగా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుతా వీసీ జాతీయ జెండాను ఆవిష్కరించి వర్సిటీ శ్రేణులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం సుబాష్‌చంద్రబోష్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామారాజు, మహాత్మగాంధీ, సర్థార్ వల్లబాయ్ పటేల్ వంటి మహానీయులను చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో విద్యావంతులు పోషించిన పాత్ర ఆమోగమైనదన్నారు. అణచివేత శక్తులపై వారు చూపించిన ధైర్యసాహసాలు అఖండ భారతావని మరిచిపోదన్నారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు ప్రగతికి, సాధికారతకు చిన్నాహాలుగా నిలుస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ఆచార్యులపైనా, విద్యావేత్తలపైనా ఉందన్నారు. లింగం, కుల, ఆర్థిక అసమానతలు లేని సమాజం సాధ్యమైనప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లన్నారు.

తరువాయి 2 లో

## ఏయూతో బిఐఎస్ అవగాహన ఒప్పందం

**వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో ఎంఓయూపై సంతకాలు**

**వర్క్‌షాపులు, రీసెర్చ్ పై కలిసి పనిచేయాలని నిర్ణయం**

**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలతో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి సమక్షంలో ఇరు వర్గాలు ఇటీవల ఒప్పంద పత్రాలను మార్చుకున్నాయి. వీసీ సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, బిఐఎస్ జాయింట్ డైరెక్టర్ వేదుల సాయికృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా రెండు సంస్థలు సంయుక్తంగా విద్యార్థుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపరచే అంశాలలో పనిచేస్తారు. ఇందుకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేస్తారు. ఆయన ఎడ్యుకేషన్ ఔట్‌రీచ్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. వివిధ అంశాలపై సంయుక్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, సింపోజియాలను నిర్వహించడం, రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలలో కలిసి పనిచేయడం ఈ ఎంఓయూ ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేసే దిశగా ఒప్పందంలో నిర్ణయం తీసుకున్నారు. శిక్షణ కార్యక్రమాలు, విద్యా సంబంధ తరగతులను సంయుక్తంగా నిర్వహిస్తారు.




## సివిల్ జడ్జిగా ఎంపికైన ఏయూ విద్యార్థి



**ఏయూన్యూస్, ఆగస్టు :** ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థి మజ్జి వంశీకృష్ణ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో కళాశాల ఆచార్యులతో కలిసి వీసీని ఇటీవల మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి వంశీకృష్ణను అభినందించారు. చిన్న వయసుతో పాటు తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల వీసీ హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత నేపధ్యం నుంచి వచ్చి, ఉన్నత ఆశయంతో ఎదగడం అభినందనీయమన్నారు. ఏయూ కు పేరు తెచ్చే విధంగా నడచుకోవాలని సూచించారు. వంశీకృష్ణ స్ఫూర్తితో ఏయూ విద్యార్థులు అత్యున్నత స్థానాలను అదిరోహించాలని ఆకాంక్షించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థిగా ఉన్న సమయంలో న్యాయాధికారుల ప్రసంగాలు, వర్సిటీ అందించిన ప్రత్యేక శిక్షణ తరగతులు తనకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ న్యాయ కళాశాల ఆచార్యురాలు కె.సీతామాణిక్యం, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఓగా ఎంపికైన ఏయూ విద్యార్థి



**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్రవిశ్వవిద్యాలయం జాగ్రఫీ విభాగం పరిశోధక విద్యార్థి గోపిశెట్టి మనోహర్ గ్రూప్ 1 పరీక్షల్లో విజయం సాధించి ఆర్టీవోగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డిని మనోహర్ ఆయన కార్యాలయంలో విభాగ ఆచార్యులతో పాటు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మనోహర్‌ను అభినందించారు. 2018లో జెఆర్‌ఎఫ్ సాధించిన మనోహర్ ఆంధ్ర విశ్వ విద్యాలయం జాగ్రఫీ విభాగంలో పరిశోధక విద్యార్థిగా ఉన్నారు. తన పీహెచ్‌డీ ప్రవేశంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పట్టణీకరణ విధానం అనే అంశంపై మనోహర్ పరిశోధనలు చేస్తున్నారు. తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1 అధికారిగా మనోహర్ ఎంపిక కావడం పట్ల వీసీ ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మనోహర్‌నిను వీసీ, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ జాగ్రఫీ విభాగ ఆచార్యుల సమక్షంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.సునీత, ఆచార్య టి.వెంకటకృష్ణ, ఆచార్య అనూజ టిగ్గాలు తదితరులు పాల్గొన్నారు.

# అసమానతలులేని సమాజానికి

# ఆచార్యులే మార్గదర్శకులు








▶▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి ఆకాంక్షించిన విధంగా ఏయూలో యువతను ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఉన్నత భవిష్యత్తుకు నేడు అందిస్తున్న నాణ్యమైన విద్య మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. సామాజిక అసమానతలను రూపుమాపడం వలన స్వాతంత్ర్యానికి నిజమైన అర్ధాన్ని ఇవ్వగలమన్నారు. అభివృద్ధిలో సమిష్టి కృషిని విశ్వసిస్తానన్న వీసీ ప్రసాదరెడ్డి ఈ దిశగా ప్రస్తుతం ఆంధ్ర యూనివర్సిటీ అభివృద్ధి టీమ్ వర్కుగా ముందుకు సాగుతుందన్నారు. వర్సిటీ అభివృద్ధిలో ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు భాగస్వాములుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాస రావు, జి.శశిభూషణ రావు, ఏ.నరసింహా రావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, వై.రాజేంద ప్రసాద్, డీన్‌లు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, టి.షారోన్ రాజు, ఎన్.ఏ.డి పాల్, ఏ.పల్లవి, అధికారులు, ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కార్యక్రమం జరిగిందిలా...

వేడుకల్లో ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డికి, రెక్టార్, రిజిస్టార్, పలువురు ప్రిన్సిపాల్స్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు చేసుకుంటూ అతిథులను వేదిక వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సందేశం అందించిన అనంతరం సాయుధ బలగాలైన ఎన్.సి.సి , ఎన్.ఎస్.ఎస్, ఏ.యూ సెక్యూరిటీ సిబ్బంది నుంచి వీసీ గౌరవ వందనం స్వీకరించారు. ప్రిన్సిపాల్స్‌తో పాటు ఆచార్యులకు, విద్యార్థులకు స్వీట్స్ పంచిపెడుతూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సాయుధ బలగాలు, శానిటైజేషన్ సిబ్బంది మరియు విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. తొలిత ఏయూ పరిపాలన భవనం వద్ద మహాత్మా గాంధీకి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు ప్రిన్సిపాల్స్, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు ఆయా కార్యక్రమల్లో పాల్గొన్నారు.














# సాధించాలనే తపనే గెలిపించింది

**జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఏయూ విద్యార్థి**
**23 సంవత్సరాల పిన్న వయస్సులోనే ఎంపిక**
**అభినందించిన ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి**



**ఏయూ న్యూస్, ఆగస్టు :** గ్రామీణ కుటుంబ నేపథ్యం, మధ్యతరగతి కుటుంబం. ఇవి అతని ఆశయం ముందు చిన్నబోయాయి. సాధించాలనే తపన ఎదగాలని ఆకాంక్ష అతనిని న్యాయమూర్తిగా నిలిపాయి. పిన్న వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు. ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పూర్వ విద్యార్థి మజ్జి వంశీకృష్ణ తల్లిదండ్రులు ఇద్దరూ పెద్ద చదువులు చదవలేదు. అయినా తమ కుమారుడిని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షతో వంశీకృష్ణకు సంపూర్ణ సహకారం అందించారు. తల్లిదండ్రులుగా తమ ఆకాంక్షలను అతనిపై రుద్దకుండా స్వేచ్ఛను అందించారు. ఉన్నత ఉద్యోగిగా ఎదగాలని ఆకాంక్షించిన వంశీకృష్ణ కలను నిజం చేసుకునే అవకాశం ఇచ్చారు. స్వశక్తితో ఎటువంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా విజయం సాధించి యువతకు ఆదర్శంగా నిలచారు.

### చిన్నతనం నుంచి ఎదగాలనే ఆకాంక్ష...

చిన్నతనం నుంచి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్ష వంశీకృష్ణలో దాగి ఉంది. శ్రీకాకుళంలో పదవతరగతిలో 10 కి 10 పాయింట్లు సాధించిన ఇంటర్‌లో 983 మార్కులు సాధించాడు. స్నేహితులందరూ ఇంజనీరింగ్ దిశగా పరుగులు పెడుతున్నా, తన మనసుకు నచ్చిన న్యాయవిద్యవైపు వెళ్లాలని వంశీ నిర్ణయించుకున్నాడు. ఏపి లాసెట్ ప్రవేశ పరీక్షరాసి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకును సాధించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో 2017లో ఐదేళ్ల న్యాయవిద్యలో ప్రవేశం పొంది 2022లో పూర్తిచేసాడు.

### న్యాయశాస్త్రంపై ఆసక్తి....

ఇతరకులకంటే కాస్త భిన్నంగా ఆలోచించే తత్వం వంశీకృష్ణ సొంతం. దీనితో తనకు చిన్నతనం నుంచి న్యాయశాస్త్రంపై ఉన్న ఆసక్తి న్యాయవిద్యలో చేరే విధంగా చేసింది. తల్లిదండ్రులు సూరిబాబు, వెంకట లక్ష్మి ఇద్దరూ స్వగ్రామం కళింగపట్నంలో టైలరింగ్ వృత్తిని చేస్తున్నారు. వీరు తన కుమారుడి ఆసక్తిని గమనించి తదనుగుణంగా ప్రోత్సహించారు. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో ఏయూలో న్యాయ విద్యను పూర్తిచేస్తున్న సమయంలో న్యాయాధికారుల ప్రసంగాలు అతనిలో స్ఫూర్తిని నింపాయి. న్యాయకళాశాలలో ఏర్పాటు చేసిన అతిథి ప్రసంగాలు, అక్కడ ప్రసంగించిన న్యాయాధికారుల మాటలు వంశీకృష్ణను న్యాయాధికారిగా మారాలనే తపనను రేకెత్తించాయి. ఈ స్ఫూర్తిదాయక ప్రసంగాలు న్యాయమూర్తిగా ఎదగడానికి నాందిగా నిలచాయి.



### కళాశాలే కార్యశాలగా....

గతేడాది జూనియర్ సివిల్ జడ్జిల ఎంపిక నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ఏయూ న్యాయ కళాశాలలో స్వల్పకాలిక అవగాహన తరగతులను నిర్వహిచారు. దీనిలో భాగంగా పరీక్షల విధానం, ప్రిలిమ్స్, మెయిన్స్‌కి సన్నద్ధత, ఇంటర్వ్యూలో అనుసరించాల్సిన విధానం తదితర అంశాలపై నిపుణులతో అవగాహన తరగతులు ఏర్పాటు చేసారు. ఇక్కడ పొంతన ప్రాథమిక అవగాహనతో తాను స్వయంగా పరీక్షకు సన్నద్ధం అవడం జరిగింది. బయట ఎక్కడా ఎటువంటి శిక్షణ లేకుండానే స్వీయ శిక్షణతో తొలి ప్రయత్నంలో జూనియర్ సివిల్ జడ్జిగా విజయం సాధించాడు వంశీకృష్ణ.



### నిత్యం 14 గంటలు ప్రిపరేషన్...

ఉదయం 4 గంటలకు వంశీకృష్ణ తన ప్రిపరేషన్ ప్రారంభించి రాత్రి 10.30 గంటల వరకు కొనసాగించేవారు. మధ్యలో కాస్త విరామం తీసకుకుంటూ రోజుకి దాదాపు 14 గంటలకు పైగా పరీక్షకు అవసరమైన సమాచారాన్ని చదవడం, రాయడం చేసేవాడు. నిత్య కొంత సిలబస్ పూర్తిచేయాలనే టార్గెట్ ఏర్పరచుకుని, దానిని ఖచ్చితంగా పూర్తిచేయడం లక్ష్యంగా అడుగులు వేసారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పూర్తిచేసి ఇంటర్వ్యూలో సైతం హైకోర్టు న్యాయమూర్తుల సమక్షంలో విజయవంతంగా సమాధానాలిచ్చి 23 సంవత్సరాల పిన్న వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు.

# అతుల్ భట్‌ను సత్కరించిన ఏయూ అలుమ్ని చైర్మన్



**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆర్ఐఎన్ఎల్ వైజాగ్ స్టీల్ ప్లాంట్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ భట్‌తో ఏయూ అలుమ్ని చైర్మన్ డాక్టర్ ఈఎస్ రావు, వైస్ చైర్మన్ డాక్టర్ కుమార్‌రాజా, మాజీ జనరల్ మేనేజర్ డాక్టర్ ఓఆర్‌పి రావు సమావేశమయ్యారు. సుమారు రెండు వేల మంది ఆర్ఐఎన్ఎల్ ఏయూ విద్యార్థులు ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం పూర్వ విద్యార్థులతో బలమైన సంబంధాన్ని మరియు సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఈ సమావేశం యొక్క ఉద్దేశ్యం. సమావేశంలో, అలుమ్నితో ఏయూ స్టీల్ ప్లాంట్ ఎండీ వివిధ అంశాలపై చర్చించారు, అలుమ్ని చైర్మన్ సీఎండీకి పలు అంశాలను వివరిఇచారు. సభ్యత్వ నమోదు మరియు పూర్వ విద్యార్థుల కనెక్షన్: ఆర్ఐఎన్ఎల్ లో కొత్త సభ్యులను నమోదు చేసుకోవడంలో మరియు ఆర్ఐఎన్ఎల్ ఏయూ పూర్వ విద్యార్థులతో కనెక్షన్‌లను పెంపొందించడంలో అలుమ్ని ఛైర్మన్ సహాయం కోరారు. జాయింట్ ప్రోగ్రామ్‌లు మరియు ఈవెంట్‌లు: మరియు ఆర్ఐఎన్ఎల్ రెండింటికీ పరస్పర ఆసక్తిని కలిగించే ఉమ్మడి ప్రోగ్రామ్‌లు మరియు ఈవెంట్‌లపై సహకరించాలనే ఆలోచనను వారు ప్రతిపాదించారు. కెపాసిటీ బిల్డింగ్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్: కస్టమైజ్డ్ కెపాసిటీ-బిల్డింగ్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను అమలు చేయడంలో ఆర్ఐఎన్ఎల్ ఫెసిలిటేటర్‌గా ఉండటానికి ఎఎఎ ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమాలకు సిఎండి సానుకూలంగా స్పందించారు మరియు వాటిని మరింత అన్వేషించడానికి అంగీకరించారు. అవసరమైన చర్యలు తీసుకోవడానికి మరియు ప్రతిపాదిత ప్రణాళికలను సకాలంలో అమలు చేయడానికి హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్‌తో తాను నిమగ్నమై ఉంటానని ఆయన పేర్కొన్నారు.



# సృజనాత్మక ఆలోచనలకు సంపూర్ణ సహకారం



**ఏయూ న్యూస్, ఆగస్టు :** సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణల దిశగా కృషి చేసే విద్యార్థులకు ఆంధ్రవిశ్వవిద్యాలయం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. ఇటీవల తన కార్యాలయంలో ఏయూ ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహించనున్న 'కెపాసిటీ ఎన్‌హేన్స్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్' ఇవెంట్ పోస్టర్‌ను వీసీ ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూ కంప్యూటర్ సైన్స్, ఈసిఈ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు సృజనాత్మక ఆలోచనల దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ సదస్సు ద్వారా నూతన ఆలోచనలు పంచుకోవాలని, వాటి కార్యరూపానికి అనుగుణంగా పరిశోధనలు, ఆవిష్కరణలు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన మంచి ఆలోచనలను ఎంపిక చేసి వాటిని మరింత అభివృద్ధి చేసే విధంగా కృషి జరగలన్నారు. వినూత్న, సమాజానికి ఉపయుక్తమైన ఆలోచనలకు విద్యార్థుల విజన్, ఆసక్తికి అనుగుణంగా వర్సిటీ యంత్రాంగం ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సు ద్వారా ఎంపికైన 5 ఉత్తమ ఆవిష్కరణలకు ఏయూ ఆ హబ్‌లో స్థానం కల్పిస్తారు. అక్కడ సౌకర్యాలను వినియోగించుకునే విధంగా పూర్తిసహకారం విద్యార్థులకు లభిస్తుందన్నారు. ఆయా ఆవిష్కరణలు మార్కెట్‌లో వచ్చే వరకు సహకారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమాసుధ, ఆచార్య పి.మల్లికార్జున రావు, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సరికొత్త ఆలోచనలు, ఆవిష్కర్తలను అన్వేషిస్తున్నాం

## కాన్సాస్ వర్సిటీ డైరెక్టర్‌తో భేటీలో వీసీ ప్రసాదరెడ్డి
## ఏయూ మరింత ప్రగతి సాధించాలన్న డాక్టర్ ఆశ్వినికుమార్



**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతిలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ టెక్నాలజీ లైసెన్సింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.అశ్వినికుమార్ అన్నారు. ఇటీవల ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా తాను చదువుకున్న హ్యూమన్ జెనిటిక్స్ విభాగంతో పాటు ఐపిఆర్ సెంటర్‌లకు వెళ్లి కొద్దిసేపు గడిపారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఇటీవల వచ్చిన మార్పులను, జరుగుతున్న ప్రగతి స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. పలు మార్పులను తాను ప్రత్యక్షంగా వీక్షించినట్లు తెలిపారు. ఎంతో దార్శినికంగా ఆలోచన చేస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను, వర్సిటీని తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతున్న విధానాన్ని కొనియాడారు. గత నాలుగు సంవత్సరాలుగా ఐపి, స్టార్టప్ రంగాలలో ఏయూ సాధించిన అభ్యున్నతి ప్రశంసణీయమన్నారు. వర్సిటీకి సంపూర్ణ సహకారం అదించడానికి తాను ఎల్లప్పుడూ సిద్దంగా ఉంటానన్నారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి ద్వారా విశాఖ నగరానికి మంచి పేరు వస్తుందన్నారు.

ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఏయూకు పూర్వవిద్యార్థులు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తున్నారన్నారు. ఐపిఆర్ పాలసీని తయారు చేసి ఇచ్చిన ఘనత ఏయూ ఐపిఆర్ సెంటర్‌కే దక్కిందన్నారు. ఇప్పటికే 15 వేలకుపైగా విద్యార్థులు ఐపి పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వర్సిటీలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా సేవలందిస్తున్నట్లు తెలిపారు సరికొత్త ఆలోచనలు, ఆవిష్కర్తల కోసం అన్వేషిస్తున్నట్లు వీసీ వెల్లడించారు. ప్రతిభ అధారంగా విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆశ్వినికుమార్ వివరించారు. కార్యక్రమంలో ఆచార్య పద్దయ్య, డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ తరపున అశ్వినికుమార్‌ను వీసీ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

# ఏయూలో హిందీ సాహిత్యంపై చర్చాగోష్ఠి



**ఏయూ న్యూస్, ఆగస్టు :** 'హిందీ సాహిత్య నిర్మాణంలో మాండలిక భాషా రూపాల పాత్ర అన్న అంశంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగంలో ఇటీవల చర్చాగోష్ఠి జరిగింది. ఏయూ హిందీ విభాగం, విశాఖ హిందీ పరిషత్, అమేథీకి చెందిన అవధీ సాహిత్య సంస్థాన్ సంయుక్తంగా ఏయూ హిందీ భవన్ సెమినార్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షులు ఎస్. ఎం. ఇక్బాల్ జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ విశాఖలో హిందీ పరిషత్ చర్చాగోష్ఠిని నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజ అభివృద్ధిలో భాష ప్రధాన భుమిక పోషిస్తుందన్నారు. ఈ నేపధ్యంలో భాషల మనుగడకు, వికాసానికి అందరి సహకారాం అవసరమన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ దీపా గుప్తా, సుధాకుమారి జుహీ, శివమ్ తివారి, శాంతి మిశ్ర గుంజన్, జయప్రకాశ్ సింగ్, ఉజ్వల్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి ప్రకటనపై ఏయూ ఉద్యోగులు హర్షం



**ఏయూ న్యూస్, ఆగస్టు:** రాష్ట్రంలోని అన్ని రంగాల్లో ఉద్యోగులకు లబ్ధి జరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇటీవల తీసుకున్న నిర్ణయంపై ఏయూ ఉద్యోగులు హర్షం వక్తం చేశారు. వర్సిటీ భోదన, భోదనేతర ఉద్యోగులంతా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. త్వరలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి జగన్ ప్రకటించడం ఆనందాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల స్నేహపూర్వక దృక్పథంతో ముందుకు సాగుతుందన్నారు. యూనివర్శిటీ ప్రగతికి ఎనలేని కృషి చేస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. డా.డి.వి.రమణారెడ్డి బి.రామచంద్రరావు, నీలపు ఈశ్వరరెడ్డి, డి.త్రినాధ రెడ్డి, అప్పలనాయుడు, ఎం.లక్ష్మణరెడ్డి, రాంబాబు, సుబ్రహ్మణ్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ర్యాగింగ్ నిరోధానికి సమిధలుగా నిలవాలి




**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'యాంటీ ర్యాగింగ్ వీక్' పెద్ద ఎత్తున నిర్వహించారు. కళాశాలలో వివిధ విభాగాలకు సంబంధించిన విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ పర్యవసానాలను ఆచార్యులు విద్యార్థిలకు వివరించారు. దీనిపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇటువంటి అంశాలను చర్చించడం వల్ల కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై అవగాహన పెరుగు తుందని కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశి భూషణరావు పేర్కొన్నారు. యువత ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. అంతేకాకుండా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా నిలిపడంతో సమిధలుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాగింగ్ సంస్కృతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎ.ప్రసాద్‌తో పాటు పలువురు ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఈ వారం డాక్టరేట్లు

## పొలిటికల్ సైన్స్‌లో పట్నాయక్‌కు ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి దంతేశ్వర్ పట్నాయక్ (దంతేశ్వరరావు)కు డాక్టరేట్ లభించించింది. ఆచార్య పేటేటి ప్రేమాదనందం పర్యవేక్షణలో ఏయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ద్వారా 'పెర్ఫార్మెన్స్ ఆఫ్ ద రూరల్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ – ఏ కేస్ స్టడీ ఆఫ్ సెలక్టడ్ మండల్స్ ఇన్ విశాఖపట్నం డిస్ట్రిక్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆయనకు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా దంతేశ్వర్ పట్నాయక్ వీసీ కార్యాల యంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులతో పాటు పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య వీర్రాజు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు పట్నాయకు అభినందనలు తెలియజేశారు.

## కెమిస్ట్రీలో రమేష్‌కు ఏయూ డాక్టరేట్




**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి తేలూరి రమేష్ బాబు కు డాక్టరేట్ లభించింది. ఆచార్య పి.శ్యామల ,శ్రీ ఆచార్య కిషోర్ బాబు ల పర్యవేక్షణలో ఏయూ కెమిస్ట్రీ విభాగం ద్వారా "ఫైటోజెనిక్ నానోపార్టిక్యులేట్ మెటల్ ఆక్సైడ్స్ ఫర్ బయోలాజికల్ అప్లికేషన్స్" అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా రమేష్ బాబుకు వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య పి.శ్యామల , ఆచార్య కిషోర్ బాబు వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు రమేష్ కు అభినందనలు తెలియజేశారు.

## ఈసీఈలో సంతోష్‌కు ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి పవడ సంతోష్ కు డాక్టరేట్ లభించింది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా 'డిజైన్ అండ్ పెర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ నాన్ – యూనిఫామ్ అండ్ నాన్ యూనిఫామ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటెన్నా అరైస్ ఫర్ అల్ట్రా – వైడ్‌బ్యాండ్ అండ్ మిల్లీమీటర్ వేవ్ అప్లికేషన్స్' అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా సంతోష్ కు వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు ఆచార్యులు, పరిశోధకులు సంతోష్ కు అభినందనలు తెలియజేశారు.

# శాతవాహన హాస్టల్‌లో ప్రిన్సిపల్ ఆకస్మిక తనిఖీలు



**ఏయూ న్యూస్, ఆగస్టు :** శాతవాహన హాస్టల్లో ఇటీవల ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల చీఫ్ వార్డెన్ ఆచార్య వీర్రాజుతో పాటు హాస్టల్ సిబ్బందితో కలిసి ఆయన ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హాస్టల్లో కొన్ని రూమ్స్ లో నాన్ బోర్డర్‌లు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేశారు. వర్సిటీతో సంబంధం లేని వ్యక్తులను బయటకు పంపించేయాలని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హాస్టల్ విద్యార్థులకు సూచించారు. నాన్ బోర్డర్స్ కు సహకరిస్తున్న విద్యార్థుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూనివర్సిటీలు ఉన్నత విద్యాఫలాల వికాసానికి వేదికలుగా మాత్రమే నిలవాలన్నారు. ఇక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు చోటులేదన్నారు. విద్యార్థులు ఈ దిశగా వర్సిటీకి పూర్తి సహాయ సహకారాలు అందించాలని ప్రిన్సిపల్ సూచించారు. రెండేళ్ల విద్యాభ్యాసంలో భాగంగా వర్సిటీలో ఉన్న అన్ని రకాల వనరులను వినియోగించుకొని ఉన్నతమైన వ్యక్తులుగా నిలవాలన్నారు. వర్సిటీకి సంబంధంలేని వారు ఎవరు హాస్టల్స్‌లోకి రాకుండా సెక్యూరిటీని మరింత పటిష్టం చేయాలని వార్డెన్ ఆచార్య వీర్రాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సహవార్డెన్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## మేథమెటిక్స్‌లో వాసవికి ఏయూ డాక్టరేట్



**ఏయూ న్యూస్, ఆగస్టు :** ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి కుంచం వెంకట వాసవికి డాక్టరేట్ లభించింది. 'అప్లైయిడ్ మేథమెటిక్స్ విభాగం ద్వారా 'ఏ స్టడీ ఆన్ వేరీయేష్ కాస్మోలాజికల్ మోడల్స్ ఇన్ మోడిఫైడ్ అండ్ స్కేలర్– టెన్సర్ థియరీష్ ఆఫ్ గ్రావిటేషన్' అంశం పై చేసిన పరిశోధనలకుగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. ఇటీవల ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదగా వాసవి వీసీ కార్యాలయంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు, పలువురు ఆచార్యులు, పరిశోధకులు వాసవికీ అభినందనలు తెలియజేశారు.

### ఏయూ యోగ కేంద్రంలో

# విస్తృతంగా ఆయుర్వేద వైద్య సేవలు







**ఏయూ న్యూస్, ఆగస్టు :** ప్రాచీన భారతీయ వైద్య విధానాలలో ఒకటైన ఆయుర్వేదాన్ని ప్రజలకు చేరువ చేసే విధంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం కృషిచేస్తోందని ఏయూ యోగా కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. ఆయా వివరాలను ఆయన ఇటీవల వెల్లడించారు. భారతీయ వైద్యవిధానాలలో ప్రముఖమైనవాటిలో ఒకటైన ఆయుర్వేదాన్ని ఉచితంగా ఏయూ ప్రజలకు అందిస్తోందన్నారు. గతేడాది డిసెంబర్ 12వ తేదీ నుంచి ఈ సేవలు బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో అందుబాటులోకి వచ్చాయని, కెజిహెచ్‌లో సుదీర్ఘకాలం సేవలందించిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కె.ఈశ్వర్ కుమార్ ప్రతీ గురువారం ఉచితంగా రోగులను పరీక్షించి, తగిన చికిత్స, ఔషధాలను సూచించడం జరుగుతోందని తెలిపారు. ఇప్పటి వరకు 230 మందికిపైగా రోగులు వివిధ ఆరోగ్య సమస్యలతో ఇక్కడకు రావడం జరిగిందన్నారు. మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం వంటి వ్యాధులకు సైతం ఇక్కడ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. 32 శాతం మందికి ఆర్థరైటిస్, స్పాండిలైటిస్ రోగులకు, 20 శాతం మందికి జీర్ణకోశ సంబంధ, 16 శాతం మందికి చర్మసంబంధ సమస్యలపైనా, 15 శాతంమందికి మానసిక సమస్యలపైనా ఇక్కడకు చికిత్సకు రావడం జరిగిందన్నారు. వీరికి అవసరమైన చికిత్సలు అందించి ఉపశమనం కలిగించినట్లు ఆచార్య భానుకుమాం వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు యోగా కేంద్రం అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.









# మువ్వన్నెల రెపరెపలు



## ఇంజినీరింగ్ కళాశాలలో...

77వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఏయూ నార్త్ క్యాంపస్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ ఆచార్య శశిభూషణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య శశిభూషణ్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు లాంటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ప్రస్తుత తరం తెలుసుకోవాలన్నారు. ఆనాటి వారి త్యాగ ఫలితంగానే నేడు భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా త్యాగాలు మరువలేనివి అన్నారు. వారి పోరాట ఫలితమే నేటి ఈ స్వాతంత్ర్యమని వారు ఇచ్చిన స్ఫూర్తితో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని యువతకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల విభాగాధిపతులు, ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో..



ఏయూ సౌత్ క్యాంపస్‌లో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహరావు ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆయన మాట్లాడుతూ ఎంతో మంది అమర వీరుల త్యాగల ఫలితమే 77 ఏళ్ల నాటి భారత స్వాతంత్ర్యమన్నారు. పలువురు త్యాగమూర్తుల వీరగాధలను కొనియాడారు. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న హత్యలు, అవినీతి వంటి అరాచకాలను అరికట్టి భావి భారతావనికి మార్గదర్శకులుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు దేశ భక్తిగీతాలతో అలరించారు. అనంతరం ప్రిన్సిపల్ అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాలకు చెందిన పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు హాజరయ్యారు.

## ఆర్ట్స్ హాస్టల్స్ ఆవరణంలో..

ఆర్ట్స్ కళాశాల హాస్టల్స్ ఆవరణంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఏయూ పీజీ ఎగ్జామినేషన్ డీన్ ఆచార్య డీవీఆర్ మూర్తి, ఆర్ట్స్ కళాశాలల చీఫ్ వార్డెన్, ఏయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య వీర్రాజులు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆచార్య వీర్రాజు మాట్లాడుతూ భారతావనికి స్వాతంత్ర్యం సిద్ధించడం వెనుక ఎందరో మహనీయుల త్యాగం ఉందన్నారు. అఖండ భారతావని, స్వేచ్ఛను సాధించడం ద్వారా దేశంలోని ప్రతి వ్యక్తికి బానిసత్వం నుంచి విముక్తి లభిస్తుందనే ధృడ సంకల్పంతో ఆనాటి యోధులు ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. భావితరాల భవిష్యత్తే లక్ష్యంగా వారి త్యాగాలు నిలిచిపోయాయన్నారు. వారి త్యాగాలను నేటి యువత వృథా చేయకుండా దేశాభివృద్ధి కోసం శ్రమించాలన్నారు. ఆచార్య హరనాథ్, ఆచార్య రాజమానిక్యం, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha,Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422